క్లుప్తంగా

నీలమణిదుర్గ అమ్మవారికి మంత్రి సీదిరి పూజలు



నీలమణిదుర్గ అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు

పాతపట్నం: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవం నీలమణీ దుర్గ అమ్మవారిని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు శనివారం దర్శించుకున్నారు. అమ్మవారికి కుంకుమ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మర్యాదలతో ఈఓ టి.వాసుదేవరావు ఆహ్వానించారు. అర్చకులు తొనంగి రాజేష్ ఆశీర్వాదం అందజేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు లింగాల ఉషారాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి తులసీవరప్రసాదరావు, ఎంపీటీసీ కె.యరకయ్య, కామేశ్వరరావు, ఉమాశంకర్, తదితరులు ఉన్నారు.

దీపావళి శుభాకాంక్షలు



రెడ్డి శాంతి, ఎమ్మెల్యే, పాతపట్నం

ఎల్.ఎన్.పేట: దీపావళి పండగ రోజున అందరి జీవితాల్లో చీకట్లు తొలగిపోయి, వెలుగులు నింపాలని కోరుతూ పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆకాంక్షించారు. పాతపట్నం నియోజకవర్గం ప్రజలకు శనివారం దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



సంక్షేమ కరపత్రాలతో లబ్ధిదారులు

పాతపట్నం: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందజేస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్ అన్నారు. పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలోని శివశంకర్‌కాలనీలోని రెండు, మూడు, నాలుగు వీధుల్లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై ప్రచారం చేశారు.ఈ కార్యక్రమం ఉద్దేశాన్ని వివరించారు. ప్రభుత్వం అమలే చేసిన సంక్షేమ పథకాలు, చేకూరిన లబ్ధి వివరాలను తెలియజేశారు. పార్టీ నాయకులు సుందరరావు, సచివాలయ కన్వీనర్లు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

మంత్రి సీదిరికి డేటా ఎంట్రీ ఆపరేటర్ల వినతి



మంత్రి సీదిరి అప్పలరాజుకు వినతిపత్రం అందిస్తున్న రాజేష్

కొత్తూరు: మండల విద్యాశాఖ కార్యాలయంలో సుమారు 18 ఏళ్ల నుంచి కాంట్రాక్ట్ పద్ధతిలో సేవలు అందిస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్లను రిగ్యులర్ చేయాలని కోరుతూ శనివారం హిరమండలంలో మంత్రి సీదిరి అప్పలరాజుకు డేటా ఎంట్రీ ఆపరేటర్ల జిల్లా సంఘం ప్రతినిధి కె.రాజేష్ వినతిపత్రం అందజేశారు. హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. విధి నిర్వహణలో మృతి చెందితే కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని విన్నవించారు. పిల్లల చదువుల నిమిత్తం ఫీజురీయింబర్స్‌మెంట్ కల్పించాలని కోరారు.

అంబేడ్కర్ చైర్ తక్షణమే నెలకొల్పాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దళిత ఐక్య వేదిక ప్రతినిధులు

పొందూరు: శ్రీకాకుళం అంబేడ్కర్ యూనివర్సిటీ అంబేడ్కర్ చైర్ తక్షణమే నెలకొల్పాలని దళిత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సాకేటి నాగరాజు, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బేకెల అప్పారావు, సామాజిక న్యాయ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కల్లేపల్లి రామ్‌గోపాల్ కోరారు. స్థానిక అంబేడ్కర్ కూడలిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద అంబేడ్కర్ జాతర కరపత్రాలను విడుదల చేశారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం చొరవచూపి బడుగు, బలహీన వర్గాలకు ఉపయోగపడే అంబేడ్కర్ చైర్ నెలకొల్పాలని డిమాండ్ చేశారు. ఈ నెల 19 ఎచ్చెర్లలో జరిగే అంబేడ్కర్ జాతరకి తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ కాసిం, నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి, అంబేడ్కర్ వర్సిటీ వైస్ చాన్సలర్ నిమ్మ వెంకటరావు హాజరుకానున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణయ్య, సామాజిక న్యాయ పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్, బొంపల రమణ, కుమిలి రాజేష్, పోతయ్య, రేగిడి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికం

- స్పీకర్ తమ్మినేని సీతారాం
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన



కాఖండ్యాంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

బూర్జ: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని, ఇదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయమని ఆంధ్రప్రదేశ్ శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని పెదలంకాం, కాఖండ్యాం గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించి, లబ్ధిదారులకు కరపత్రాలు అందజేశారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష ప్రజాదరణ వస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు అందుతున్నాయా, లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులను అభివృద్ధి చేసిందన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీని ఆదరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బెజ్జిపురపు రామారావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు కర్నేన నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, ఏపీ టిడ్కో డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, వైస్ ఎంపీపీలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణమూర్తినాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు బగాది నారాయణమూర్తి, తహసీల్దార్ ఎస్.రమణారావు, ఎంపీడీఓ ఎం.రవీంద్రబాబు, డీసీఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాం నాయుడు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఇసాయి వెంకటరావు, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు ఎస్.ఉదయకుమార్, స్థానిక సర్పంచ్‌లు కొబగాన రామకృష్ణ, కాకితాపల్లి గోవిందరావు, గుమ్మడి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

నిత్యవసర సరుకుల అందజేత



వలంటీర్ కుటుంబానికి నిత్యావసరాలు అందజేస్తున్న మామిడి శ్రీకాంత్



బియ్యం, నిత్యావసరాలు అందజేస్తున్న తులసీవరప్రసాదరావు

పాతపట్నం: పాతపట్నం మేజర్ పంచాయతీ ఎస్సీ వీధికి చెందిన వలంటీర్ బెనియా సత్యనారాయణ ఇంట్లో ఇటీవల గ్యాస్ సిలిండ్ పేలిన ప్రమాదంలో ఇంట్లో సామగ్రి బూడిదై సర్వం కోల్పోయారు. రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ శనివారం వలంటీర్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. బాధితుడుని ఆదుకోవాలని కలెక్టర్, తహసీల్దార్‌తో శ్రీకాంత్ ఫోన్‌లో మాట్లాడారు. నిత్యవసర సరులు బాధిత కుటుంబానికి శ్రీకాంత్ అందజేశారు. కరకవలస మన్మథరావు, టి.నాగరాజు, ఎస్.చిన్నయ్య, తిరుపతిరావు, ఎం.నారాయణరెడ్డి, గోపి, శ్రీరామ్ గోపాల్, పలువురు నాయకులు పాల్గొన్నారు. అలాగే గ్రామ వలంటీర్ కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి లోతుగెడ్డ తులసీవరప్రసాద్‌రావు శనివారం పరామర్శించారు. ప్రభుత్వం తరఫున ఆదుకుంటామన్నారు. బాధిత కుటుంబానికి నిత్యవసర సరుకులు అందజేశారు. శిర్ల జోగారావు, ప్రభాకరరావు, కే.సంజీవరావు, ఎస్.రమేష్, ఇందిరరామ్, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కళింగ వైశ్య సంఘం ప్రతినిధులు

నరసన్నపేట: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కళింగ వైశ్యులను బీసీ–డీ జాబితాలో చేర్చుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకొని, జీఓ జారీ చేయడం పట్ల కళింగ వైశ్య జిల్లా సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం నరసన్నపేట వైఎస్సార్ కూడలి వద్ద సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా కళింగ వైశ్య కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ అంధవరపు సూరిబాబు మాట్లాడుతూ గతంలో కళింగ వైశ్యులను వైఎస్సార్ హయాంలో బీసీ జాబితాలో చేర్చారని, అది కొన్ని జిల్లాలకే పరిమితమైందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని సీఎం జగన్‌ను కోరగా సానుకూలంగా స్పందించి తాజాగా అమలు చేశారని పేర్కొన్నారు. ఓబీసీలో చేర్చడానికి కూడా ఓబీసీ కమిషన్‌కు తగిన సమాచారం ఇచ్చారన్నారు. కార్యక్రమంలో కళింగ వైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు తంగుడు జోగారావు, ప్రతినిధులు పొట్నూరు సాయి ప్రసాద్, కేసీహెచ్‌బీ గుప్త, బోయిన బాలకృష్ణ, తంగుడు నాగేశ్వరరావు, పొట్నూరు కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

డీఎల్‌డీఏ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా అప్పలనాయుడు



ఆమదాలవలస రూరల్: జిల్లా లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ (డీఎల్‌డీఏ) మెంబర్‌గా ఆమదాలవలస మండలం కొత్తవలస గ్రామానికి చెందిన గురుగుబెల్లి అప్పలనాయుడు నియమితులయ్యారు. జిల్లాలో పశువులకు అందించే లైవ్ స్టాక్‌ను అర్హులైన రైతులకు అందించేందుకు ఈ నామినేట్ పోస్టు ఎంతో దోహదపడుతుందని ఆయన అన్నారు. పాడి రైతుల అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని అప్పలనాయుడు తెలిపారు. తనకు ఈ అవకాశం కల్పించిన శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంకు కృతజ్ఞతలు తెలియజేశారు. డీఎల్‌డీఏగా నియమితులైన అప్పలనాయుడిని సర్పంచ్ మెట్ట ఆనందరావు, ఎంపీటీసీ సభ్యుడు కూటికుప్పల సన్యాసిరావు, గ్రామస్తులు అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆమదాలవలస రూరల్: ఆమదాలవలస ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో అంగన్వాడీ హెల్పర్స్ పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్లు పీఓ గీత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమదాలవలస మండలంలో మునగవలస హెల్పర్ పోస్టుకు ఓసీ, చిట్టివలస పోస్టుకు ఎస్సీ, రావికంటిపేట పోస్టుకు ఎస్సీగా రోస్టర్ పద్ధతిలో రిజర్వేషన్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. అర్హత గల అభ్యర్థులు ఈ నెల 17వ తేదీలోగా ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

ఆమదాలవలసలో..

ఆమదాలవలస: ఆమదాలవలస ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీఓ ఎస్.గీత తెలిపారు. ఆమదాలవలస మండలం చిట్టివలస, మున్సిపాలిటీ పరిధి రావికండిపేట అంగన్‌వాడీ కేంద్రాల్లో హెల్పర్ పోస్టులకు ఎస్సీ రిజర్వేషన్ కల్పించినట్లు పేర్కొన్నారు.

బూర్జలో..

బూర్జ: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మామిడివలస, అన్నంపేట, గ్రామాల్లో అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ ఎస్.గీతారాణి తెలిపారు. అన్నంపేట ఆయా పోస్టు కోసం జనరల్ కేటగిరి, మామిడివలస ఎస్సీ కేటగిరికి చెందిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. స్థానికంగా నివాసం ఉండి వివాహమైన మహిళలు అర్హులన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత చెంది, 21 నుంచి 35 ఏళ్ల లోపు వయస్సు ఉన్నవారు ఈ నెల 17వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోగా బూర్జ కార్యాలయానికి, పోస్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

కొత్తూరులో..

కొత్తూరు: స్థానిక ఐసీడీఎస్ పరిధిలో ఖాళీగా ఉన్న ఏడు అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి అర్హులు ఈ నెల 17 తేదీ సాయంత్రం 5 గంటలులోగా దరఖాస్తులు చేసుకోవాలని సీడీపీవో విమలకుమారి శనివారం తెలిపారు. హిరమండలం మండలం పరిధిలో బొత్తడసింగి అంగన్‌వాడీ కేంద్రంలో హెల్పర్ పోస్టు ఓసీ (ఈడబ్ల్యూఎస్), అంబావల్లిలో కార్యకర్త పోస్టు ఎస్సీ, కొండరాగోలులో కార్యకర్త పోస్టు బీసీ–ఎ, గేసరగూడ మినీ అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త పోస్టు బీసీ–డీలకు కేటాయించారు. కొత్తూరు మండలంలో హంసలో హెల్పర్ పోస్టు ఓసీ, మాకవరంలో హెల్పర్ పోస్టు ఎస్టీ, నేరడి(ఎన్) అంగన్‌వాడీ కార్యకర్త పోస్టు ఎస్టీలకు కేటాయించినట్లు పేర్కొన్నారు.

అందుబాటులో అపరాల విత్తనాలు

ఎల్.ఎన్.పేట: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో అపరాల విత్తనాలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి పైడి లతశ్రీ శనివారం తెలిపారు. మినుము, పెసర విత్తనాలు కావాల్సిన రైతులు ఆర్‌బీకేలకు వెళ్లి వ్యవసాయ సహాయకులను సంప్రదించాలన్నారు. మినుములు 4 కిలోల ప్యాకెట్ రూ.300, పెసలు 4 కిలోల ప్యాకెట్ రూ.250లకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. విత్తనాలు కోసం ఆధార్ కార్డు జిరాక్స్, సెల్‌ఫోన్ తీసుకుని ఆర్‌బీకేకు వెళ్లాలని సూచించారు. అపరాల విత్తనాలు వేసుకునేందుకు ఇదే సరైన సమయమన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



స్పీకర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఆపస్ ప్రతినిధులు

ఆమదాలవలస: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం సీనీయర్ నాయకులు సనపల నర్సింగరావు ప్రభుత్వాన్ని కోరారు. స్పీకర్ తమ్మినేని సీతారాంను శనివారం స్పీకర్ క్యాంప్ కార్యాలయం వద్ద కలిసి వినతిపత్రం అందించారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గోరువాని చెరువులో పూడికతీత

నరసన్నపేట: కార్తీక మాసం సందర్భంగా భక్తుల సౌకర్యార్థం స్థానిక భవానీపురం వద్ద గల గోరువాని చెరువును పరిశుభ్రం చేశారు. చెరువు సమీపంలో శివాలయాలు అధికంగా ఉండటం, రోజూ మహిళలు వేకువజామున స్నానాలు చేసేందుకు, దీపాలు వదిలేందుకు వీలుగా శనివారం పనులు చేపట్టారు. సర్పంచ్ బూరల్లి శంకర్, వార్డు సభ్యులు బీఎల్ శర్మ పర్యవేక్షించారు. సమీప వీధులకు చెందిన మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

విశ్వబ్రాహ్మణులను ఆదుకుంటాం

ఆమదాలవలస: మండలంలోని విశ్వబ్రాహ్మణుల్లో గల పేదలను ఆదుకునేందుకు తనవంతు కృషి చేస్తానని శ్రీమద్విరాట్ విశ్వకర్మ విశ్వబ్రాహ్మణ ఎంప్లాయ్ అసోసియేషన్ అధ్యక్షుడు లోలుగు విశ్వేశ్వరరావు అన్నారు. ఆమదాలవలస పట్టణంలో శనివారం సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం బలోపేతానికి తీసుకోవాల్సిన కార్యాచరణ, వివాహ పరిచయ వేదికను త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. సంఘంలోని ఒంటరి మహిళలకు సహాయం చేయాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. సంఘం అధ్యక్షుడు విశ్వేశ్వరరావును సభ్యులు సత్కరించారు. సంఘం సభ్యులు దుప్పలపూడి శ్రీనివాసరావు, పూర్ణచంద్రరావు, రాజేశ్వరరావు, ఒమ్మి భాస్కరరావు, టీకే గోపాల్, లోలుగు దిలీప్, చెవ్వూరు కామేశ్వరరావు పాల్గొన్నారు.

ఔదార్యం..



చెల్లమ్మకు నగదు, నిత్యావసర సరుకులు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

కొత్తూరు: మండలానికి చెందిన భగత్ సింగ్ ట్రస్టు సభ్యులు ముగ్గురు వ్యక్తులకు శనివారం రూ.68 వేలు అందజేసి తమ ఔదార్యం చాటుకున్నారు. ఇచ్ఛాపురం మండలం కేశపురం గ్రామానికి చెందిన శివంగ కూర్మారావు, భూలక్ష్మిల కవల పిల్లలు ప్రాణాంతకమైన వ్యాధితో బాధపడుతుండటంతో రూ.35వేలు అందజేశారు. ఎల్.ఎన్.పేట మండలం బొత్తడసింగి గ్రామానికి చెందిన అధికారి జగన్నాథం కిడ్నీ వ్యాధితో మృతి చెందడంతో నిరుపేద అయిన ఆయన భార్య చెల్లమ్మకు రూ.15 వేలు అందించారు. హిరమండలం మండలం నౌతల గ్రామానికి చెందిన గొర్లె హరిష్ అరుదైన వ్యాధితో బాధపడుతుండటంతో రమేష్‌కు రూ.18 వేలు, రెండు నెలలకు సరిపడే నిత్యావసర సరుకులు అందజేసినట్లు ట్రస్టు చైర్మన్ నడిమింటి జగదీశ్వరరావు తెలిపారు. ట్రస్టు సభ్యులు విరాళాల రూపంలో సేకరించగా వచ్చిన మొత్తాన్ని ఆపదలో ఉన్నవారికి అందించినట్లు చెప్పారు. ప్రతి నెలా ఈ విధంగా ఆర్థిక సహాయం చేస్తున్నట్లు చైర్మన్ తెలిపారు.

పులి సంచారంపై అప్రమత్తం



బంధువురంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ సిబ్బంది

మెళియాపుట్టి: ఇటీవల కొంత కాలంగా టెక్కలి, మెళియాపుట్టి మండలాల సరిహద్దు గ్రామాల్లో పెద్దపులి పాద ముద్రలను అటవీశాఖ అధికారులు గుర్తించారు. అందులో భాగంగానే శనివారం మండలంలోని జంతూరు, బందపల్లి, దీనబంధుపురం గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించారు. టెక్కలి అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తున్న ఆనవాలు గుర్తించామని, సాయంత్రమైతే ప్రజలు బయటికి రాకుండా ఉండాలని, రాత్రి వేళల్లో పంట పొలాలకు వెళ్లే రైతులు కొద్దిరోజులు మానుకోవాలన్నారు. పులి అలికిడి కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలన్నారు. ఎఫ్ఎస్‌ఓలు గౌరీశంకర్, శ్రీనివాసరావు, ఎఫ్‌బీఓలు నరేంద్ర, ఝాన్సీ, రంజిత్‌కుమార్, ఏబీఓ రమణ, రజనీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న డోల జగన్

సారవకోట: అంబేడ్కర్ గొప్ప దార్శనికుడని డీసీసీబీ మాజీ చైర్మన్ డోల జగన్ అన్నారు. మండలంలోని అలుదు గ్రామంలో గల హరిజన వీధిలో ఆ గ్రామానికి చెందిన కొర్రాయి ప్రసాదరావు తన పుట్టినరోజు పురస్కరించుకుని అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు శనివారం భూమిపూజ నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి హాజరైన డోల జగన్ మాట్లాడుతూ రాజ్యాంగ రచయిత అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. సారవకోట ఎస్ఐ జి.అప్పారావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావు, సినీ నిర్మాత బలగ ప్రకాశ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శులు పైడి నాగభూషణరావు, సనపల అన్నాజి, కోత మధు, దాలయ్య, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరు

- స్పీకర్ తమ్మినేని సీతారాం



పెనుబర్తిలో తాగునీటి కుళాయిల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

పొందూరు: నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ తాగునీటిని అందిస్తానని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా మండలంలోని పెనుబర్తిలో రూ.54 లక్షలతో, అలమాజీపేటలో రూ.43 లక్షలతో, ఖాజీపేటలో రూ.70 లక్షలతో కుళాలు నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. ప్రజారోగ్యానికి వైఎస్సార్‌సీపీ పెద్దపీట వేస్తోందని, దానిలో భాగంగానే ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పప్పల రమేష్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, సర్పంచ్ తమ్మినైన ఝాన్సీ, జేసీఎస్ మండల కన్వీనర్ బాడాన కృష్ణారావు, తమ్మినైన మురళీకృష్ణ, చింతాడ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.